ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





మనకూ ఉన్నాయ్.. శివకాశీలు!

- ఉమ్మడి జిల్లాలో బాణసంచా తయారీ
- ప్రతి జిల్లాలోనూ ప్రధాన కేంద్రాలు
- ఏడాదంతా వేలాది మందికి ఉపాధి
- శివకాశీని తలదన్నే ఉత్పత్తులు

బాణసంచా అంటే ప్రతి ఒక్కరి నోటా వినిపించే మాట శివకాశీ.. ఎందుకంటే అక్కడ మందు గుండు సామగ్రి నాణ్యతగా ఉంటుందనేది ప్రతి ఒక్కరి మాట.. నేటికీ శివకాశీ మాట వినిపించకుండా దీపావళి పండుగ జరగదు.. బాణసంచా అంటే శివకాశీ ఒకటే కాదండోయ్.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ అటువంటి ప్రాంతాలు జిల్లాకో పది వరకూ ఉంటాయి.. అవెక్కడో ఉన్నాయనుకుంటున్నారా.. ఒక్కసారి బాణసంచా తయారు చేసే ప్రధాన ప్రాంతాలేంటో తెలుసుకుంటే.. ఇక్కడా అని ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది.. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం.. రామచంద్రాపురం మండలం ద్రాక్షారామం, జువ్విపాడు ఇలా చెప్పుకుంటూ పోతే బాణసంచా తయారీనే ఉపాధిగా మలుచుకున్న గ్రామాలెన్నో ఉన్నాయి. ఒక పక్కన ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా.. దశాబ్దాలుగా వేలాది మందికి అదే ఉపాధి.. అధికారికంగా తయారీ కేంద్రాల లెక్క పదుల సంఖ్యలో ఉంటే.. అనధికారికంగా ఈ లెక్క వందల్లో ఉంటుందనేది అధికారులెరిగిన సత్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆనందమైనా.. బాధయినా.. ఉత్సవమైనా.. జాతరైనా.. రాజకీయ మీటింగ్ అయినా చివరికి పుట్టినరోజు అయినా కూడా మందుగుండు సందడి చేయాల్సిందే మరి.. అందుకే ఏడాదంతా మూడు బాంబులు.. ఆరు చిచ్చుబుడ్లుగా ఈ వ్యాపారం సాగుతూనే ఉంటుంది.. రేపు దీపావళి పండుగ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తయారీ కేంద్రాలపై ప్రత్యేక కథనం.. - వివరాలు 8లో

‘బెల్టు’ తీస్తారా..

జిల్లాలో కొన్ని ప్రైవేటు మద్యం దుకాణాలు అక్రమాలకు తెరతీశాయి. మందుబాబులును నిలువునా పిండేసేలా అధిక ధరలకు మద్యం విక్రయాలు మొదలుపెట్టాయి. లైసెన్స్ ఫీజులు లక్షల్లో కడుతున్నామనే సాకుతో ఎమ్మార్పీలను ఉల్లంఘించి అమ్మకాలు జరుపుతున్నాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులకు సైతం దుకాణాల నుంచే మద్యం విక్రయాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రైవేటు మద్యం దుకాణాలపై వరుసగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎమ్మార్పీ ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలోని ఎక్సైజ్‌శాఖ అప్రమత్తమైంది. అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తే పట్టుకునేందుకు 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. బుధవారం నుంచి ఇవి రంగంలోకి దిగబోతు న్నాయి. బెల్ట్‌షాపులకు మద్యం దుకాణాల నుంచి సరుకు సరఫరా అయినా, అటు ఎమ్మా ర్పీలను ఉల్లంఘించినా పట్టుకునేందుకు సిద్ధమవుతున్నాయి. అందులోభాగంగా మారు వేషాల్లో వెళ్లి మద్యం కొనుగోలు చేయడం ద్వారా వైన్‌షాపులకు అధికారులు షాక్ ఇవ్వనున్నారు. తొలిసారి దొరికితే రూ.5 లక్షల జరిమానా, రెండోసారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తారు. ఒకపక్క ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతుంటే మరోపక్క కొందరు కూటమి ఎమ్మెల్యేల బంధువులు బెల్ట్‌షాపులకు వేలం వేస్తుండడం విశేషం.

- జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు గీతదాటకుండా ప్రభుత్వం చర్యలు
- ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్టు దుకాణాలకు మద్యం విక్రయాలపై అప్రమత్తం
- ఇటీవల అధిక ఫిర్యాదుల నేపథ్యంలో సీఎం సమీక్షతో ఎక్సైజ్ శాఖ పరుగులు
- వైన్‌షాపులపై నిఘాకు సన్నాహాలు మొదలుపెట్టిన జిల్లా ఎక్సైజ్‌శాఖ
- 15 ప్రత్యేక బృందాలు ఏర్పాటు.. నేటి నుంచి మారువేషాల్లో నిఘా
- అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ తొలిసారి పట్టుబడితే రూ.5 లక్షల ఫైన్
- మళ్లీ దొరికితే లైసెన్స్ రద్దుకు ఆదేశాలు.. యానాం మద్యంపైనా తనిఖీలు
- మరోపక్క జిల్లాలో కొందరు ఎమ్మెల్యేల బంధువులు బెల్ట్ దందా మొదలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ సర్కారు హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా నాసిరకం మద్యం విక్రయించి మందుబాబుల ఆరోగ్యంతో అప్పటి ప్రభుత్వ పెద్దలు ఆడుకున్నారు. తద్వారా కోట్లలో సంపాదించారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ దందాకు చెక్ పెట్టింది. మందుబాబుకు నాణ్యమైన మద్యం అందించడం, ధరలు తగ్గించి ప్రైవేటు దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తూ ఆదేశాలు జారీచేసింది. దీంతో ఈనెల నుంచి జిల్లాలో 155 ప్రైవేటు మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాలు మొదలయ్యాయి. అయితే ఒకపక్క ప్రభుత్వం గత ప్రభుత్వ అక్రమాలకు చెక్‌పెట్టి సంస్కరణలు తీసుకురాగా, మరోపక్క కొన్ని ప్రైవేటు మద్యం దుకాణాలు అప్పుడే అక్రమాలకు తెరతీశాయి. భారీగా సంపాదించడం కోసం ఏకంగా మద్యం దుకాణాల్లో మందును ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి ఏడు నుంచి పది వరకు జరుగుతున్న విక్రయాల్లో ఈతరహా ఉల్లంఘనలు అధికంగా జరుగుతున్నాయి. అలాగే మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో వైన్‌షాపులు లేనిచోట్ల సదరు దుకాణాల నిర్వాహకులు ఏకంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. మరికొన్నిచోట్ల బెల్ట్ నిర్వాహకులతో చేతులు కలుపుతున్నారు. అందులోభాగంగా వైన్‌షాపులో సరుకును బెల్ట్ దుకాణాలకు చేర్చుతున్నారు. అక్కడ కల్తీ చేయడంతోపాటు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. అయితే ఈ దందాలో కొందరు కూటమి ఎమ్మెల్యేల బంధువులు నేరుగా జోక్యం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ నియోజకవర్గంలో సదరు ఎమ్మెల్యే మేనల్లుడు ఏకంగా తనకు కొంత వాటా ఉన్న వైన్‌షాపు నుంచే బెల్ట్ దుకాణాలకు సరుకు వెళ్లాలని ఆదేశించాడు. ఇలా తీసుకువెళ్లే వారంతా ఆ వైన్‌షాపు వద్ద రూ.2 లక్షలు డిపాజిట్ చేయాలని హుకుం జారీచేశారు. అలాగే మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పది గ్రామాల్లో ఎనిమిదిచోట్ల బెల్ట్‌షాపులు నిర్వహిస్తుంటే వారందరినీ పిలిచి అందరి తరఫున ఒకరే సరుకు విక్రయించాలని డ్రా తీసి సదరు వ్యక్తిని ఎంపిక చేశారు. హైవేను ఆనుకుని ఉన్న రెండు నియోజకవర్గాల్లోను ఇదే దందా మొదలైంది. ఇలా ఎక్కడికక్కడ అనేకచోట్ల ఎమ్మెల్యేల బంధువులు పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరుస ఫిర్యాదులతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్ట్ దుకాణాలకు సరుకు తరలినా కఠినంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు ఎక్సైజ్ ఉన్నతాధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లాలోని ఆ శాఖ అధికారులు మంగళవారం రాత్రి వరకు ప్రత్యేక బృందాల ఏర్పాటుపై కసరత్తు జరిపారు.

మారువేషాల్లో కొనుగోలు..

ఎమ్మార్పీ ఉల్లంఘనలపై నిఘాకు జిల్లాలో మొత్తం 15 బృందాలను ఏర్పాటుచేస్తూ మంగళవారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు. ఒక బృందంలో సీఐ, కానిస్టేబుళ్లు, మరికొన్ని బృందాల్లో ఎస్‌ఐ, కానిస్టేబుళ్లు ఉండేలా ప్రత్యేక టీంలు సిద్ధం చేశారు. ఇవన్నీ బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలపై నిఘా పెట్టనున్నాయి. మారువేషాల్లో సైతం మద్యం దుకాణాలకు వెళ్లి మద్యం కొనుగోలు చేయనున్నాయి. ఎక్కడైనా ఎమ్మార్పీకి మించి సరుకు విక్రయిస్తే వెంటనే సంబంధిత దుకాణం నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి రూ.5 లక్షల జరిమానా విధించనున్నారు. అదే దుకాణం రెండోసారి అధిక ధరలకు మద్యం విక్రయించినట్టు తేలితే షాపు లైసెన్సు రద్దు చేసనున్నారు. అయితే ఏరోజు ఎక్కడ నిఘా వేయాలో, దాడులు చేయాలనేది అప్పటికప్పుడు ఉన్నతాధికారులు నిర్ణయించనున్నారు. అలాగే ఆయా బృందాలు రోజువారీ ఏంచేశాయనేది ఉన్నతాధికారులకు నివేదికలు కూడా ఇవ్వాలని నిబంధన విధించారు. ఇదిలాఉంటే బెల్ట్ దుకాణాలకు జిల్లాలో కొన్ని షాపుల నుంచి సరుకు భారీగా వెళ్తున్నట్టు ఇప్పటికే గుర్తించారు. ఈ నేపథ్యంలో రాత్రివేళల్లో రోజుకు కొన్ని గ్రామాల చొప్పున ప్రత్యేక బృందాలు తనిఖీ చేయనున్నాయి. అక్కడ కల్తీతో పాటు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తుండడంతో బెల్ట్ నిర్వాహకులపైనా కేసులు నమోదుచేయనున్నారు. మరోపక్క జిల్లాలోకి యానాం నుంచి సైతం ఇప్పటికి మద్యం అడ్డదారిలో వస్తోంది. నాటుసారా సైతం గోదావరి కాలువల ద్వారా గ్రామాల్లోకి భారీగా వస్తోంది. దీంతో దీనిపైనా నేటి నుంచి నిఘా ముమ్మరం చేస్తున్నట్టు జిల్లా ఎక్సైజ్ అధికారి వివరించారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్య

ఇంట్లోంచి దుర్వాసన రావడంతో వెలుగులోకి

మూడు రోజులై ఉండొచ్చన్న పోలీసులు

రైట్ రైట్... మళ్లీ విధుల్లోకి డ్రైవర్ లోవరాజు

ఆర్టీసీ బస్సు ముందు డాన్స్ చేయడంతో విధుల నుంచి తొలగింపు

నారా లోకేశ్ ట్వీట్‌తో స్పందించిన అధికారులు

దక్కిన ఉద్యోగం 9



కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలి : ఎస్పీ

కాకినాడ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాల నియంత్రణ కోసం విస్తృతంగా అవగాహన సమావేశాలు కల్పించాలని, బాధితులు తక్షణమే 1930కు ఫోన్ చేసి రక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ ఆనందోత్సాహాలతో జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అగ్ని ప్రమాదం జరక్కుండా ముందస్తు నివారణ చర్యలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రహదారి భద్రతకు పెద్దపీట వేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. చోరీలు జరక్కుండా రాత్రి గస్తీ మరింత పెంచాలని ఆదేశించారు. మహిళల రక్షణ కోసం త్వరలో మహిళా రక్షక్ వాహనాలు ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. ఈ వాహనాల వల్ల అన్ని విద్యాసంస్థలు, పార్కుల్లో మహిళలు సంచరించే ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహించడం ద్వారా రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈమధ్య కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ మోసానికి గురైన బాధితులు వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని, లేనిఎడల 1930 నెంబర్‌కు ఫోన్ చేసి రక్షణ పొందాలని కోరారు. ఈ సమావేశంలో కాకినాడ, పెద్దాపురం డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, డీసీఆర్, డీటీఆర్, ఐటీ కోర్, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు : జేసీ

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్‌కార్డున్న అర్హులైన లబ్ధిదారులందరికీ ఏడాదికి మూడు సిలిండర్లు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా విలేకరుల సమావేశం నిర్వహించి ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయాలను వెల్లడించారు. ముందుగా గ్యాస్ బుక్ చేసుకునేటప్పుడు ఏజెన్సీకే ఆ నగదును చెల్లించాలని, తర్వాత వారి నెంబరుకు ఒక మెసేజ్ వస్తుందని పట్టణ ప్రాంతాల్లో ఒకరోజులోను, గ్రామీణ ప్రాంతాల్లో రెండు రోజుల్లోగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. మంగళవారం నుంచి మార్చి 31వ తేదీ 2025 వరకు సిలిండర్ పొందే లబ్ధిదారులు ఆ గ్యాస్ ఏజెన్సీల వద్ద బుక్ చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ప్రభుత్వం ఏర్పాటుచేసిన టోల్‌ఫ్రీ నెంబరు 8886903611 ఫోన్‌చేసి తెలుసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం లబ్ధిదారులకు అందిస్తున్న రీతిలోనే, రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల మహిళలకు కానుకగా ఈ దీపావళి పండుగ నుంచి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా సరఫరా చేసే పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రయోజనం పొందేందుకు లబ్ధిదారులు ఆధార్ నెంబరు, రేషన్‌కార్డు నెంబరు, ఆధార్ లింక్ చేసిన బ్యాంకు అకౌంట్ నెంబరు, గ్యాస్ కనెక్షన్ నెంబరు ఉండాలన్నారు. ఈ అంశాలు కలిగిన లబ్ధిదారుల జాబితాలు ఆయా ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 6 లక్షల 50 వేలమంది తెల్లరేషన్, బియ్యం కార్డు కుటుంబాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరా అధికారి ప్రసాద్, సీఎస్ డీటీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

‘బాణసంచా’ రాద్ధాంతం ముగిసింది..

కాకినాడ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో తలెత్తిన బాణసంచా దుకాణాల రాద్ధాంతం ముగిసింది. ఎంపీ తరఫువారు భానుగుడి పద్మప్రియ థియేటర్ ఎదురుగా ఖాళీస్థలంలోను, సిటీ ఎమ్మెల్యే తరఫువారు మెయిన్‌రోడ్‌లో చిన్నపాటి స్థలంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణం అనుమతులను అధికారులు రద్దు చేయడంతో దుమారం రేగింది. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఆర్డీవో కార్యాలయం వద్ద టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు రోడ్డు మీద పడుకుని నిరసన తెలిపారు. దీంతో అధికారులు మెయిన్‌రోడ్‌లోనే కౌస్తుభా హోటల్ సమీపాన ఖాళీస్థలంలో బాణసంచా దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు సిటీ ఎమ్మెల్యే తరఫువారికి అనుమతిచ్చారు. ఇక మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్, బోటు క్లబ్ స్థలంలో దుకాణాలు ఏర్పాటుచేశారు.

పాదగయ క్షేత్రంలో కార్తీకమాసానికి విస్తృత ఏర్పాట్లు

పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో కార్తీకమాసానికి తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం దర్శన వేళలు పెంచినట్టు చెప్పారు. నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకూ ప్రతిరోజూ తెల్లవారుజామున 4గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల దాకా, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 9గంటల దాకా ఆలయం తెరిచి ఉంటుందని తెలిపారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే పాదగయ పుష్కరిణిలో పాత నీటిని తొలగించి శుభ్రపరిచిన తర్వాత కొత్త నీరు పెట్టినట్టు చెప్పారు. మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పాదగయ పరిసరాల్లో పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనరును కోరామని, నిత్యాన్నదాన పథకంలో ఎక్కువ మంది భక్తులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.



తొండంగి మండలం ఏవీ నగరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

లైఫియస్ ఫార్మా కంపెనీని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని

ఏవీ నగరంలో సభ

- వార్త మెయిన్‌లో





మనకూ ఉన్నాయ్..
శివకాశీలు!



కొమరిపాలెంలో తయారుచేసిన సెర్పిలైట్లు



వెలుగు జిలుగుల రంగేళి.. దీపావళి. దివ్వెల పండుగంటే చిన్నాపెద్దా అందరికీ ఆనందమే. ముఖ్యంగా పిల్లలకు ఒక అద్భుత లోకాన్నే వీక్షిస్తున్నట్టు విరజిమ్మే బాణసంచా వెలుగులంటే చెప్పలేనంత సంతోషం. గతంలో బాణసంచా కావాలంటే ఎవరి ఇంటి దగ్గర వాళ్లే సొంతంగా తయారుచేసుకునేవారు. సిసింద్రీలు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, పటాసులు, నారబాంబులు ఇళ్ల వద్దే నెలరోజుల ముందు నుంచే తయారుచేసేవారు. మిగిలిన బాణసంచా మాత్రం స్థానిక వ్యాపారులు తయారుచేసి అమ్మేవారు. తర్వాత శివకాశీ నుంచి బాణసంచా దిగుమతులు పెరిగాయి. బ్రాండింగ్ పేరుతో అది రెట్టింపు అయింది. అయినప్పటికీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో బాణసంచా తయారుచేసే కేంద్రాల్లో పెద్దఎత్తున మందుగుండు సామగ్రి సిద్ధమవుతోంది. స్థానికంగా తయారుచేసే వీటిని ఇతర ప్రాంతాలకూ ఎగుమతి చేస్తున్నారు. ఏడాది పొడవునా చూస్తే ఈ వ్యాపారం కోట్లలోనే సాగుతోంది. ఇందులో దశాబ్దాల తరబడి బాణసంచా తయారీలో పేరొందిన గ్రామాలున్నాయి. ప్రాణాపాయం ఉన్నప్పటికీ ఇదే జీవనాధారంగా చేసుకున్న వందలాది మంది కార్మికులు ఉన్నారు. మన ప్రాంతంలో బాణసంచా తయారీ సంస్థలపై ప్రత్యేక కథనం.

దీపావళేకాదు.. మరెన్నో సంబరాలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లోని పలు గ్రామాలు బాణసంచా తయారీలో ప్రసిద్ధి చెందాయి. అందులో ప్రధానమైనవి బిక్కవోలు మండలం కొమరిపాలెం, సామర్లకోట మండలం వేట్లపాలెం, రామచంద్రపురం మండలం ద్రాక్షారామ, జువ్విపాడు.. ఇలా పది గ్రామాల వరకు బాణసంచా తయారీ జరుగుతుంది. దాదాపు ఐదు దశాబ్దాల నుంచి ఇదే పరిశ్రమలో కొనసాగుతున్నవారు ఉన్నారు. వందలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. కేవలం దీపావళి కోసమే కాకుండా జాతరలు, ఉత్సవాల సందర్భంలో మందుగుండు కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా జరుగుతాయి. ఈ మందుగుండు కాల్పుల విషయంలో పోటీలు కూడా పెడతారు. అలాగే వివాహాలు, ఇతర కార్యక్రమాలు, రాజకీయ వేడుకల్లో కూడా మందుగుండు కాల్చడం మన ప్రాంతంలో ఆనవాయితీగా ఉంది. దీంతో ఇక్కడ బాణసంచా పరిశ్రమ కొనసాగడానికి ప్రధాన కారణమని చెప్పాలి.

ఓ వెలుగు వెలిగి..

(ఆంధ్రజ్యోతి- మండపేట/యు.కొత్తపల్లి)

మందుగుండు సామగ్రి తయారీలో మండపేట కూడా ప్రసిద్ధి. ఇక్కడ తయారయ్యే బాణసంచా రాష్ట్రవ్యాప్తంగా ఎగుమతులు జరిగేవి. తర్వాత వరుస ప్రమాదాల్లో తయారీదారులు మృతి చెందడంతో ఇక్కడ తయారీ కనుమరుగైపోయింది. టీడీపీ నిర్వహించే మహానాడు సభల సందర్భంగా ప్రారంభ వేడుకల్లో మండపేట నుంచి వెళ్లే మందుగుండు కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. మాజీ ఎమ్మెల్యేలు దివంగత వీవీఎస్ఎస్ చౌదరి, వల్లూరి నారాయణరావులు ఈ కార్యక్రమాన్ని వారి ఆధ్వర్యంలో జరిగేలా చూసుకునేవారు. పట్టణంలో మొత్తం ఆరు కుటుంబాలు మందుగుండు తయారుచేసేవారు. ఇందులో అన్నవరపు కోటేశ్వరరావుకు చెందిన నాలుగు కుటుంబాలు అగ్ని ప్రమాదాల్లో మరణించగా, మిగిలిన రెండు కుటుంబాలూ మందుగుండు తయారీ మానేశారు. అలాగే కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం వాకతిప్పలో పదేళ్ల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో 18 మంది మృతి చెందడంతో అక్కడ తయారీ ఆగిపోయింది. పెదపూడి, అమలాపురంలలో కూడా ప్రమాదాలతో తయారీ నిలిచిపోయింది.

బాణసంచాకు కేరాఫ్ అడ్రస్ కొమరిపాలెం, బిక్కవోలు



బిక్కవోలులో తయారు చేస్తున్న పేల్పు జువ్వలు

(ఆంధ్రజ్యోతి-బిక్కవోలు)

దీపావళి బాణసంచాకు తూర్పుగోదావరి జిల్లా కొమరిపాలెం, బిక్కవోలు గ్రామాలు రాష్ట్రవ్యాప్తంగా పేరొందాయి. కొమరిపాలెం గ్రామంలో 1932లో వెలుగుబంట్ల వీరన్న బాణసంచా తయారీ ప్రారంభించగా, ఆయన కుమారులు సత్యనారాయణమూర్తి, రామకృష్ణలు వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేశారు. ప్రస్తుతం శ్రీగణపతి ఫైర్ వర్క్స్ పేరిట వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి తన కుమారుడు చిట్టిబాబుతో కలసి బాణసంచా తయారీ పరిశ్రమను కొనసాగిస్తున్నారు. ఇక్కడ శివకాశీ మాదిరిగా డిస్కో చిచ్చుబుడ్లు, టపాసులు, మతాబులు, బేబీ కాండెల్స్, పెన్సిళ్లు, తాళ్లు, పేల్పు జువ్వలు, బ్యాటరీ బాక్సులు, ఔట్లు, సెర్పిలైట్లు, రాకెట్లు తయారు చేస్తారు. అలాగే పండుగలకు, వివిధ ఫంక్షన్లలో కాల్చే ఈతచెట్లు, మల్లెపందిరి, నాగసర్పం, చైనావీల్, రన్నింగ్ వీల్, కలర్‌డైమండ్ వీల్, స్వస్తిక్‌వీల్, పెద్ద సెర్పిలైట్లు, జపాన్‌రింగు, మద్రాసు ఔట్లు తయారు చేస్తారు. వీరు తయారుచేసిన బాణసంచాను అప్పట్లో 1952లో మద్రాసులో జరిగిన ఏఐసీసీ సమావేశంలోను, 1978లో బెంగళూరులో జరిగిన జాతీయక్రీడల్లోను, 1983లో ఎన్టీఆర్ ప్రమాణస్వీకారానికి, 1983, 1999లలో హైదరాబాద్‌లో జరిగిన ఫిలిం ఫెస్టివల్స్‌కు, పలు చలన చిత్రాల శతదినోత్సవ వేడుకలకు కాల్చి కొమరిపాలెం ఖ్యాతిని చాటారు. 1999లో శిల్పారామంలో నిర్వహించిన బాణసంచా పోటీల్లో కొమరిపాలెం బాణసంచాకు ప్రథమస్థానం పొందడంతో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్యనారాయణమూర్తి సత్కారం పొందారు. అలాగే కొమరిపాలెంతోపాటు బిక్కవోలులోని శ్రీగోలింగేశ్వరా ఫైర్ వర్క్స్‌ను ఆకాలంలోనే కొప్పిశెట్టి సూర్యనారాయణ ప్రారంభించగా ఆపై ఆయన కుమారుడు సత్యనారాయణ కొనసాగించగా, ఆయన మనుమడు శ్రీనివాస్ నిర్వహిస్తూ బిక్కవోలు బాణసంచా ఖ్యాతిని నిలిపారు. ఇంకా బిక్కవోలులో కనకదుర్గా హుస్సేనియా ఫైర్‌వర్క్స్ పేరిట బాణసంచా తయారు చేస్తున్నారు. కొమరిపాలెంలో వెలుగుబంట్ల వారి వద్ద శిక్షణ పొందిన వేల్పూరి సత్తిబాబు, నూకారెడ్డిలు 30 ఏళ్ల నుంచి భవానీ గ్రాండ్ ఫైర్స్ పేరిట బాణసంచా తయారు చేస్తున్నారు.

ప్రభుత్వం సబ్సిడీ రుణాలివ్వాలి



తాము ప్రమాదమని తెల్సినా అందరికీ ఆనందం కల్గించేందుకు ఏళ్ల తరబడి బాణసంచా తయారుచేస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నాం. మా వద్ద నేర్చుకున్న 80 మంది ఆరు జిల్లాల్లో సొంతంగా బాణసంచా తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మా వద్ద 20 కుటుంబాల వారు పనిచేస్తున్నారు. వీరికి ఏటా ఇన్సూరెన్స్ కూడా చెల్లిస్తున్నాం. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలన్నీ చేపట్టాం. గంధకం, సూరేకారం, బీడు, అల్యూమినియం పౌడర్‌ను రూర్కెలా, హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుని వాడతాం. తమిళనాడు రాష్ట్రంలో బాణసంచా తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తున్నారు. ఇక్కడ కూడా పరిశ్రమగా గుర్తించి సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలి.

- వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫైర్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు

శివకాశి టు యానాం. ఏటా రూ. 8 కోట్ల వ్యాపారం



యానాంలో వ్యాపారి నాగేశ్వరరావు

(ఆంధ్రజ్యోతి-యానాం)

కేంద్రపాలిత ప్రాంతం యానాంలో తయారీ పరిశ్రమ లేదుకానీ ఏటా ఉభయగోదావరి జిల్లాల స్థాయిలో ఏటా రూ.8 కోట్ల నుంచి పది కోట్ల వరకు బాణసంచా అమ్మకాలు సాగుతాయి. ఇక్కడి వ్యాపారులు నేరుగా శివకాశి నుంచి మందుగుండు సామగ్రిని ప్రత్యేక వాహనాల్లో తీసుకువస్తారు. యానాంలో అనునిత్యం దొరికే 7 హోల్‌సేల్ షాపుల్లో విక్రయాలు సాగిస్తారు. వీటితోపాటు దీపావళికి వారం ముందే మరో 21 షాపులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. నేరుగా తీసుకురావడం వల్ల తక్కువకే వెరైటీలన్నీ లభిస్తాయి. ప్రస్తుత్తం పిల్లలతోపాటు పెద్దలను ఆకట్టుకునేందుకు రిటైల్ వ్యాపారస్తులు ఫ్యాన్సీ ఐటమ్స్‌పై మోజు చూపిస్తున్నారని, ఆ వెరైటీలు ఈసారి ఎక్కువగా వెళుతున్నాయని బాణసంచా వ్యాపారి నాగేశ్వరరావు చెప్పారు.

రెండో శివకాశీ.. వేట్లపాలెం



వేట్లపాలెంలో టపాసుల తయారీ దృశ్యం

(ఆంధ్రజ్యోతి-సామర్లకోట)

దీపావళి బాణసంచా తయారీలో రెండో శివకాశీగా పేరొందిన గ్రామం వేట్లపాలెం. ఇది సామర్లకోట మండలంలో ఉంది. ఇదే మండలంలోని హుస్సేనుపురం, జి మేడపాడు గ్రామాల్లో కూడా పెద్దఎత్తున బాణసంచా తయారయ్యేది. ఏటా రూ.5 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరుగుతూ 500 మంది కూలీలకు ప్రత్యక్షంగానూ, మరో వెయ్యి మందికి పరోక్షంగానూ బాణసంచా తయారీ ద్వారా ఉపాధి లభించేది. అయితే 2019 సెప్టెంబరు 30న జి. మేడపాడు కెనాల్ రోడ్డులోని ఒక బాణసంచా తయారీ సంస్థలో జరిగిన పేలుళ్లలో ఆరుగురు మృతి చెందారు. దాంతో ఆ గ్రామంలో బాణసంచా తయారీ మూతపడింది. కొవిడ్ తర్వాత, వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఆంక్షల వల్ల సామర్లకోట మండలంలో ఈ వ్యాపారం కాస్త తగ్గిందనే చెప్పాలి. కానీ ఈ ఏడాది మళ్లీ భారీగా బాణసంచా తయారీ జరుగుతోంది. వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల్లో సుమారు ఏడు దశాబ్దాలుగా బాణసంచా తయారీచేస్తూ విక్రయాలు చేయడమేగాకుండా అంతకుమించి శివకాశి బాణసంచా సరుకులను కూడా ఈ ప్రాంత వ్యాపారులు దిగుమతులు చేసుకుంటూ ఏటా కోట్లలోనే లావాదేవీలు సాగిస్తుంటారు. వేట్లపాలెం, హుస్సేన్‌పురంలలో తయారయ్యే బాణసంచాలో చిచ్చుబుడ్లు, సెర్పిలైట్లు పేరొందాయి. మిగిలిన రకాల్లో మిడతల దండు, రాకెట్లు, చిటపటలు ప్రసిద్ధి. ఇక పలు పెళ్లిళ్లకూ, ఇతర వేడుకలకు ఇక్కడ తయారుచేసే బాణసంచాలో పందిరిమంచం, ఈతచెట్టు, రన్నింగ్‌బాల్, పాము బుసలు తదితర కలర్స్ రాకెట్లకు గిరాకీ ఎక్కువ.

తరతరాలుగా బాణసంచా తయారీలో ద్రాక్షారామ, జువ్విపాడు



జువ్వలు తయారు చేస్తున్న పెద్దిరెడ్డి సుబ్బారావు

(ఆంధ్రజ్యోతి-ద్రాక్షారామ)

ద్రాక్షారామ కేంద్రంగా పెద్దిరెడ్డి వంశీకులు మూడు తరాలుగా బాణసంచా తయారీలో కొనసాగుతున్నారు. 1940లో మద్రాస్ లైసెన్సుతో పెద్దిరెడ్డి సుబ్బారావు మందుగుండు తయారీ ప్రారంభించారు. తదుపరి ఆయన కుమారులు పెద్దిరెడ్డి వీర్రాజు కాకినాడలో, పెద్దిరెడ్డి రాంబాబు, సూరిబాబులు ద్రాక్షారామలో బాణసంచా తయారీ చేపట్టారు. ద్రాక్షారామలో పెద్దిరెడ్డి సూరిబాబు ఆంజనేయ ఫైర్‌వర్క్సు స్థాపించి బాణసంచా తయారీలో పేరుప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. ద్రాక్షారామలో కార్తీక దీపారాధన మహోత్సవంలో పెద్దిరెడ్డి సూరిబాబు బాణసంచా కాల్పులు చూసేందుకే వేలాదిమంది జనం ఎగబడేవారు. ప్రస్తుతం మూడో తరం వారసులు బాణసంచా తయారీని కొనసాగిస్తున్నారు. పెద్దిరెడ్డి వీర్రాజు అనంతరం వారసులు పెద్దిరెడ్డి సత్తిబాబు తూరంగి, పెద్దిరెడ్డి సూరిబాబు మృతి చెందడంతో ఆయన అల్లుడు దవులూరి వెంకట్రాజు అలియాస్ శ్రీను, పెద్దిరెడ్డి రాంబాబు కుమారుడు పెద్దిరెడ్డి సుబ్బారావు తాళ్లపొలంలో బాణసంచా తయారీ చేస్తున్నారు. తారాజువ్వలు, రాకెట్లు, విజిల్‌రాకెట్లు, బెలూన్ రాకెట్లు, ఆకాశదీపాలు, విజిల్ షాట్స్, బేబీ క్యాండిల్స్, మిడతల దండు, చిచ్చుబుడ్లు, డిస్కోబుడ్లు, బ్యాటరీ బ్యాక్సు దండ్లు, గొట్టం ఔట్లు, కలర్‌పెన్సిల్లు, సెర్పిలైట్లు, ఈతచెట్లు, మల్లి పందిరి, నాగస్వర్పం, చైనారింగు, జపాన్ రింగు, రన్నింగ్ బాల్, డైమండ్ వీల్ వంటివి ఇక్కడ తయారీకి ప్రసిద్ధి. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు.

జువ్విపాడు.. పేరు

రామచంద్రపురం మండలంలోని ఓదూరు పంచాయతీ శివారు జువ్విపాడు అనే గ్రామం ఉంది. జిల్లేళ్ల ఆనందరావు ఈ గ్రామంలో బాణసంచా తయారీ ప్రారంభించారు. తదుపరి కొన్నేళ్లకు వెంకట్రావు త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు పేరుతో బాణసంచా తయారీ కేంద్రం ప్రారంభించారు. త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు స్థాపనతో జువ్విపాడు బాణసంచా తయారీకి పేరెన్నికగా మారింది. దీపావళితో పాటు ముఖ్యంగా తిరునాళ్లు, జాతరలు, పండుగలకు త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు బాణసంచా మారుపేరుగా నిలిచింది. త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు బాధ్యతలు వినకోటి శ్రీనివాస్ చేపట్టిన అనంతరం ఉభయగోదావరి జిల్లాల్లో జాతరలు, తిరునాళ్లలో త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు పాల్గొని పలు బహుమతులు సొంతం చేసుకుంది. ఇలా బాణసంచా తయారీదారులు జువ్విపాడు ఊరిపేరు సార్థకం చేశారు.



ఆంజనేయ ఫైర్‌వర్క్సు యజమాని దవులూరి



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం,



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా చక్రస్నానం

- ముగిసిన బ్రహ్మండ నాయకుని బ్రహ్మోత్సవం
- మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణం, స్వామివారి ఏకాంత సేవ
- ముగింపు ఉత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు

ఆత్రేయపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిదవ రోజు మంగళవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజావహరోణంతో బ్రహ్మండనాయకుని బ్రహ్మోత్సవం ఘనంగా ముగిసింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడిని చేశారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరి బ్రహ్మోత్సవ పూజలు అందుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు, ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు- కనకదుర్గ దంపతులు నిర్వహించారు. సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మేళతాళ మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని పల్లకిలో అశేష



స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు



పూల ఊయలలో స్వామివారికి ఏకాంత సేవ దృశ్యం

భక్తజన గోవిందనామస్మరణ నడుమ గౌతమి గోదావరి వద్దకు తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి చక్రస్నాన మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం మహాఆశీర్వచనము నిర్వహించారు. ధ్వజావరోహణంతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. రాత్రి స్వామివారి అద్దాల మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఉయ్యాలలో ఏకాంత సేవ జరిపారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో ముదునూరి వెంకట్రాజు-సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం- మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారులు ప్రదర్శనలు విద్యుత్, పుష్పాల అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. తొమ్మిది రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తన్మయత్వం పొందారు.



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు దంపతులు

నేడు యథావిధిగా ఆర్జిత సేవలు

బ్రహ్మోత్సవాలు ముగియడంతో స్వామివారి ఆర్జిత సేవలు బుధవారం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు ఉపకమీషనరు చక్రధరరావు తెలిపారు. నోము ఆచరించిన భక్తులు ఆన్‌లైన్ స్లాట్ విధానంలో టిక్కెట్లు బుక్‌చేసుకుని అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు తదితర ఆర్జిత సేవలు నిర్వహించుకోవాలని ఈవో కోరారు.

పుష్కరాలకు సన్నద్ధమవుదాం

- 2027 గోదావరి పుష్కరాలపై సమీక్ష
- గత అనుభవాలే పాఠాలుగా..
- జిల్లాను యూనిట్‌గా తీసుకుని ప్రణాళిక
- రహదారుల విస్తరణ, ఘాట్ల అభివృద్ధి
- సీతానగరంవైపు వీఐపీ ఘాట్ల నిర్మాణం
- తొలి సమన్వయ సమావేశంలో రాష్ట్ర మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి



తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలో పుష్కరాలపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్, చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, ముప్పిడి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28: గత అనుభవాలనే పాఠాలుగా చేసుకుని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా 2027 అఖండ గోదావరి పుష్కరాలను నిర్వహిద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం 2027 అఖండ గోదావరి పుష్కరాల సమన్వయ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అఖండ గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. అఖండ గోదావరి పుష్కరాలకు జిల్లాను యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని సమర్థవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకువెళదామన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు అఖండ గోదావరి పుష్కరాలకు వస్తారనే అంచనా వేస్తున్నట్టు తెలిపారు. అఖండ గోదావరిలో ఎక్కడ స్నానం చేసినా పుణ్యం వస్తుందనే విషయం భక్తులకు తెలియజేయాలన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ అఖండగోదావరి పుష్కరాలకు సంబంధించి ప్రభుత్వశాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాగునీరు తదితర మౌలిక వసతులు, నూతనంగా మరికొన్ని ఘాట్లకు ప్రతిపాదనలు, టెంపుల టూరిజంపై దృష్టిపెట్టాలన్నారు. కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ పుష్కరాలకు సంబంధించి వీఐపీ ఘాట్లను సీతానగరంవైపు నిర్మించాలన్నారు. గోదావరి వ్యూ అద్భుతంగా ఉండే ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు.కడియం నర్సరీ ప్రాంతాల్లో అతిథిగృహాలు, మౌలిక సదుపాయాలు, సమగ్రప్రాతిపదికన అభివృద్ధికి ప్రతిపాదన చేయాలన్నారు. రహదారుల విస్తరణ పనులు జరగాలని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నగరంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో మొత్తం 26స్నానాలరేవులు ఉన్నాయన్నారు. విజ్జేశ్వరం నుంచి పట్టిసీమ వరకు 13 ఘాట్లు ఉన్నట్టు తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల పేరు చెబితే సీతానగరం మండలంలో గుర్తుకు వచ్చేది మునికూడలి ఘాట్ అన్నారు. దానికి గతంలో చంద్రబాబు దేవాన్ష్ ఘాట్‌గా నామకరణ చేశారని తెలిపారు. ఈ రేవును ఆధునీకరించాలన్నారు. సీతానగరంలో 8 రేవులు ఉన్నట్టు తెలిపారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ మాట్లాడుతూ అఖండ గోదావరి పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తుల రద్దీకి తగ్గట్టుగా విడివిడిగా మార్గాలు ప్రతిపాదిస్తున్నామన్నారు. భక్తుల వసతి కోసం శాటిలైట్ సిటీ, బస్టాండ్ పార్కింగ్ స్థలం గుర్తించాం, సీసీ కెమెరాలు, ప్రవేశ నిర్గమ ద్వారాలు, లోకల్ ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై ఆయా శాఖలతో చర్చలు జరుపుతాం.కమిషనర్ కేతన్‌గార్గ్ తొలుత పుష్కరాలపై ఏవి ప్రదర్శన చేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులతో కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తన డివిజన్ పరిధిలోని కొవ్వూరు నుంచి నిడదవోలు వరకు గోదావరి రేవుల పరిస్థితిని వివరించారు. గతంలో పార్కింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు బకాయిలు చెల్లించకపోవడంతో ఇప్పుడు రైతులు ముందుకు రావడంలేదన్నారు. అయినా వారితో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. లక్ష్మీనగర్ లేఅవుట్‌లో ఉన్న స్థలాన్ని పార్కింగ్‌కు వినియోగించవచ్చని చెప్పారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ సీతానగరం నుంచి కడియం వరకు ఉన్న రేవుల పరిస్థితిని వివరించారు. నూతనరేవుల నిర్మాణాలకు అనుగుణంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నా రు. టూరిజం ఆర్డీ స్వామినాయుడు మాట్లాడుతూ టూరిజం పరంగా ప్రణాళికతో ముందుకు వస్తామన్నారు. రెండో సమావేశం నాటికి తాము మరిన్ని ప్రణాళికలతో వస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీలు దేవకుమార్, భవ్యకిషోర్, ఆర్ఎంసీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం



స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం బహుళద్వాదశిని పురస్కరించుకుని స్వామి-అమ్మవార్లకు శాంతి కల్యాణం నిర్వహించారు. తొలుత ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శాంతి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి, అర్చకులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్యామ్‌కుమార్‌కు ఎంపిక పత్రం ఇస్తున్న వీసీ మురళీకృష్ణ

అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు పరిశీలకునిగా శ్యామ్‌కుమార్

జేఎన్టీయూకే, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ ఆధ్వర్యంలో చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో బుధవారం నుంచి నవంబరు 3వ తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కబడ్డీ పోటీలకు పరిశీలకునిగా జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్‌ను నియమిస్తూ ఏఐయూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్యామ్‌కుమార్‌ను ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించి యూనివర్శిటీకి మంచి పేరు తీసుకురావాలని వీసీ ఆకాంక్షించారు.



తుని డిపోలో డ్రైవర్ లోవరాజు

రైట్ రైట్... మళ్లీ విధుల్లోకి లోవరాజు

తుని రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ లోవరాజు మంగళవారం ఉదయం విధుల్లో చేరాడు. నాలుగు రోజుల కిందట బస్సు ముందు డ్యాన్స్ చేయడంతో ఆయన్ను విధుల నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ చొరవ చూపడంతో అధికారులు తిరిగి విధులు అప్పగించారు. దీంతో లోవరాజు మంగళవారం ఉదయం తుని-కాకినాడ బస్సు ఎక్కి ఉత్సాహంగా బాధ్యతలు స్వీకరించాడు.



అమ్మా... నాన్నా... మీరెక్కడ!

- ఏడిద బాణసంచా పేలుడు ఘటనలో తండ్రి దుర్మరణం
- తల్లి ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం
- బంధువుల సంరక్షణలో చిన్నారి మోక్షిత్

మండపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ పాలబుగ్గల చిన్నారి తల్లి పిలుపు కోసం, నాన్న లాలన కోసం అమాయకంగా ఎదురు చూస్తున్నాడు. వారు ఏమయ్యారో కూడా తెలియని పసి వయసు. ఎవరు ఎత్తుకుంటే వారి వద్దే ఉంటున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలో సోమవారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో కల్లి వెంకటకృష్ణ మృతి చెందిన సంగతి తెలిసిందే. అతడి భార్య జయశ్రీ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతోంది. వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. వెంకటకృష్ణ-జయశ్రీ తమ కుమారుడు మోక్షిత్‌కు ఇటీవలే మొదటి పుట్టినరోజు జరిపారు. పేలుడు సమయంలో పక్కింటి వద్ద ఆడుకుంటుండటంతో ఆ చిన్నారి ప్రాణాలతో బయటపడ్డాడు. ముద్దులొలుకుతున్న ఆ పసివాడిని వెంకటకృష్ణ బంధువులు, చుట్టుపక్కల వారు లాలిస్తున్నారు. బోర్లు కొడుతూ జీవనం సాగించే వెంకటకృష్ణ మృతితో అతడి కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇదే ప్రమాదంలో గాయపడ్డ వెంకటకృష్ణ తల్లిదండ్రులు కోలుకుంటున్నారు.



గో వధకు...

- కొత్తపల్లి అడ్డాగా పశువుల తరలింపు
- వారంలో మూడుసార్లు రవాణా
- ముగ్గురు వ్యక్తుల సిండికేట్
- తద్వారా లక్షలాది రూపాయల అర్జన



చింతూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొంతమంది కఠినాత్ములు ఒక సిండికేట్‌గా ఏర్పడ్డారు. గో వధ కోసం పశువులను అమ్ముతూ లక్షలు ఆర్జించడం మొదలుపెట్టారు. వీరి దందా కారణంగా వందల సంఖ్యలో పశువులు కబేళాలకు తరలిపోతున్నాయి. వ్యాన్లు, కంటైనర్లలో కిక్కిరిసి తరలించడం వారు ఎంచుకున్న మార్గం. అందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కొత్తపల్లిని అడ్డాగా ఎంచుకున్నారు. వీరికి పశువులను సరఫరా చేసేందుకు సరిహద్దు రాష్ట్రమైన ఒడిశాలో మరో ముఠా ఉంది. ఒడిశాలో ఊరూరా తిరిగి పశువులను కొనుగోలు చేయడం ఆ ముఠా వంతు. తర్వాత వాటిని సీలేరు నదిపై నాటు పడవల్లో దాటించి కొత్తపల్లి చేరుస్తున్నారు. ఇక్కడి నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు కంటైనర్లు, వ్యాన్లలో తరలిస్తున్నారు. ఇలా తరలించేందుకు చింతూరు (ఎర్రంపేట)కు చెందిన ఓ వ్యక్తితో పాటు గోకవరం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, ఒడిశాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. వీరంతా గోవధతో కొద్ది కాలంగా లక్షలు ఆర్జిస్తున్నారు. ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో రాత్రివేళ ఈ తరలింపు ప్రక్రియ యథేచ్ఛగా సాగుతోంది. దందా ఎవరి కంటా పడకుండా ఆ ముఠా జాగ్రత్త పడుతుంది. ఇందులో భాగంగా తులసిపాకల, ఎర్రగొండపాకల పరిసర అటవీ ప్రాంతంలో వందల సంఖ్యలో పశువులను కట్టేస్తున్నారు. అనంతరం రహస్య ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకున్న ర్యాంపుల వద్దకు వాహనాలు చేరుకుంటాయి. అప్పటివరకు రోజుల తరబడి పశువులు నీరు, మేత లేకుండా అల్లాడిపోతుంటాయి. దీంతో కొన్ని పశువులు అక్కడే మృత్యువాతపడుతున్నాయి. అంతేకాదు వ్యాన్లలో ఎక్కించే సమయంలో మొరాయించిన పశువుల కాళ్లు విరగ్గొట్టి పడేస్తారు. ఇదంతా నిత్యం సాగుతున్న బహిరంగ దందా. పశువులు దాచి ఉంచిన రహస్య ప్రదేశాల వద్దకు ఇతరులెవ్వరు వెళ్లినా వేగుల ద్వారా ఆ సమాచారం ఆ ముఠాకు ఇట్టే చేరుతుంది. పశువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే విధిగా నియమ నిబంధనలు పాటించాల్సి ఉంది.

ఈ విషయంలో ఆ ముఠా తమ తెలివి తేటలను ప్రదర్శిస్తుంది. పోలీసు చెక్‌పోస్టులు దాటే వరకు పశువులను కాలినడకన తరలించడం అందులో ఒక భాగం. అనంతరం జనసంచారం లేని ప్రదేశాల్లో వ్యాన్లు, కంటైనర్లలో ఎక్కించి తరలించి సొమ్ములు చేసుకోవడం వీరికి వెన్నుతో పెట్టిన విద్య. మరికొన్ని పశువులను కూనవరం వద్ద గోదావరిలో పడవలపై దాటించి రుద్రంకోట చేరుస్తున్నారు. ఇదంతా అర్ధరాత్రి సమయంలోనే. దాదాపు 50 మంది దాకా ఈ పనులన్నీ చక్కపెడతారు.





ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎర్రగొండపాకల-తులసిపాకల మధ్య, కూనవరం వద్ద గోదావరి ఒడ్డున గోవులను సిద్ధం చేసిన దృశ్యం





బాలురు సింగిల్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లో విజేతలు వీరే

కాకినాడ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. వివిధ జిల్లాల క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. మంగళవారం పోటీలను రాష్ట్ర పరిశీలకుడు ఎస్.వెంకటసుబ్బయ్య, ఎస్కే బాబు, టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌కుమార్ పరిశీలించారు. వి.రవిరాజు, కె.నూకరాజు, కౌర్, జి.సునీల్‌కుమార్, కె.పరశురాం పాల్గొన్నారు.

బాలుర సింగిల్స్...

అండర్-19 విభాగంలో ఎస్.హేమంత్‌సాయి (శ్రీకాకుళం), సీహెచ్ నవీన్ (చిత్తూరు), బి.కరుణ (చిత్తూరు), ఆర్.విశాల్ (రాజమహేంద్రవరం), ఎస్.దివ్యేశ్ (విశాఖ). షాయిఖ్ అబూ బాఖబ్ సిద్ధిక్ (చిత్తూరు), ఎం.రేవంత్(కృష్ణా), ఎం.సూర్యతేజస్విని (కృష్ణా), ఎస్కే అబ్బర్ అహమ్మద్ (గుంటూరు), వై.తేజిత్ (గుంటూరు), ఎస్.చరణ్‌కుమార్ (గుంటూరు), కె.అభిషేక్‌కుమార్ (తూర్పు గోదావరి), పి.రోహిత్‌చంద్ (గుంటూరు), పి.వీవన్‌గౌతమ్ (గుంటూరు), రిషి కరుణ (తూర్పు గోదవరి)

అండర్-14 విభాగంలో

ఎస్కే మహ్మమద్ హర్షద్ (చిత్తూరు), కె.శ్రీకృష్ణ (శ్రీకాకుళం), ఎస్ఏఆర్ ప్రభాస్‌రెడ్డి (కర్నూలు), వై.మహంత్‌నీలేష్‌రెడ్డి (కర్నూలు), టి.వెంకటసాయిఅరుష్ (గుంటూరు), యు. సాయిశౌర్య (కృష్ణా), జి.నిఖిలేష్ (తూర్పు గోదావరి), వై.హరీష్ (కృష్ణా), వై.నీరజ్‌రెడ్డి (గుంటూరు), కె.నిశాంత్ (కర్నూలు), బి.పవన్ సాయి (విజయనగరం), ఎస్.ఈశ్వర్‌హితేష్ (కృష్ణా), దుర్గాశ్రీఅఖిల్ (పశ్చిమ గోదావరి), ఎన్.ధీరజ్ (అనంతపురం), ఎన్.నాగచరణ్ (తూర్పు గోదావరి) పవన్‌కుమార్‌యశరాజ్ (చిత్తూరు), బి.ధాత్రేష్ (విశాఖ), ఎస్‌టీఎస్‌టీ సుభాష్ (తూర్పుగోదావరి), వై.ఈశాన్ (తూర్పు గోదావరి), ఎ.వీరన్ (విశాఖ)

బాలికల సింగిల్స్ అండర్-14 విభాగంలో

పి.సేవిత (విశాఖ), ఎస్కే ఆనమ్ హబాబ్ (అనంతపురం), పీవీ శుక్తిశ్రీ (గుంటూరు), డి.ఆరీఫా (అనంతపురం), ఎస్.తనిష్కారెడ్డి (గుంటూరు), జి.శ్రీవేద (తూర్పు గోదావరి), పి.వేదశ్రీ (శ్రీకాకుళం).



అండర్-14,17 విభాగాల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీలు అందుకున్న క్రీడాకారులు

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలు

మలికిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ 68వ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం బహుమతులు అందజేశారు. బాలురు అండర్-17 విభాగంలో తూర్పు గోదావరి జిల్లా (ప్రథమ), విశాఖపట్నం జిల్లా (ద్వితీయ), అండర్-14 విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా (ప్రథమ), విశాఖపట్నం (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. బాలికలు అండర్-17 విభాగంలో కృష్ణా జిల్లా (ప్రథమ), అనంతపురం జిల్లా (ద్వితీయ), అండర్-14 విభాగంలో కృష్ణా జిల్లా (ప్రథమ), నెల్లూరు జిల్లా (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో పోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో శ్రీరామ అకాడమీ ఫౌండర్ దెందుకూరి రాంబాబురాజు, కార్యదర్శి అడబాల విజయశ్రీనివాస్, ఎం.సత్యరాజు, పెద్దిరాజు పాల్గొన్నారు.

పుష్కర కాలువలో పడి యువకుడి మృతి



గండేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారికి చెందిన ఐనపాల ధర్మరాజు (30) గ్రామ శివారున పెద్ద చెరువు దగ్గరలోని పొలానికి వెళ్లేందుకు సోమవారం రాత్రి పుష్కర కాలువ అక్విడెక్టు సైడ్‌వాల్ మీదుగా నడుచుకుంటూ వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. విషయం తెలియగానే స్థానికులు వెతకగా మంగళవారం ఉదయం కాలువలో విగతజీవిగా దొరికాడు. గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ శివనాగబాబు కేసు నమోదు చేశారు.

త్రోబాల్, బాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య, క్రీడల పట్ల సమాన ఆసక్తి కనబరచాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పు గోదావరి స్థాయి అండర్-14, 17 బాలికల త్రోబాల్, బాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. హెచ్ఎం పులగం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి, నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్య

- ఇంట్లోంచి దుర్వాసన రావడంతో బయటపడ్డ వైనం
- మూడు రోజులై ఉండొచ్చన్న పోలీసులు

కాకినాడ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ తల్లి, కూతురు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆకాశం స్వాతి (28), ఆమె తల్లి ఆకాశం సరస్వతి (60) 12 ఏళ్లుగా కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెంకే వారి వీధిలో గుర్రాల శ్రీనివాస్‌కుచెందిన శ్రీదుర్గా నివాస్‌లో అద్దెకు ఉంటున్నారు. సరస్వతి పెద్ద కుమార్తె హారికకు వివాహమై విశాఖపట్నంలో ఉంటోంది. రెండో కుమార్తె స్వాతి ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ తల్లిని పోషిస్తోంది. కొంత కాలంగా సరస్వతి మానసిక పరిస్థితి బాగా లేని కారణంగా తల్లి, కూతురు మధ్య మనస్పర్థలు వచ్చాయి.





ఆత్మహత్యకు పాల్పడిన స్వాతి (పాత చిత్రం), మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ నాగదుర్గారావు

ఒకరిని విడిచి మరొకరు ఉండలేని ఆ తల్లీకూతుళ్లు తీవ్ర మనస్తాపానికి గురై చనిపోదామని నిర్ణయించుకుని చీరలతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికీ తెలియలేదు. మంగళవారం ఇంట్లోంచి దుర్వాసన వస్తుండడం గమనించిన గుర్రాల శ్రీనివాస్ కిటికీలను తెరిచి చూడగా తల్లి, కూతురు విగతజీవులుగా కనిపించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. స్వాతిని పెళ్లి చేసుకోమని తల్లి సరస్వతి తరచూ ఒత్తిడి తెస్తోందని... తల్లిని విడిచి ఉండలేక, పెళ్లంటే ఇష్టం లేక వారు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికులు చెప్తున్నారు. ఇది జరిగి సుమారు మూడు రోజులై ఉంటుందని సీఐ నాగదుర్గారావు వెల్లడించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇన్వర్టర్ బ్యాటరీ పేలుడు కూడా కారణమే

తేల్చిన ఫోరెన్సిక్ నిపుణుల బృందం

ఏడిదలో బాణసంచా పేలుడు ఘటనపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా విజయవాడ నుంచి ముగ్గురు నిపుణులతో కూడిన ఫోరెన్సిక్ బృందం వచ్చింది. ఇంటిని పరిశీలించి ప్రమాద ఘటనకు కారణాలపై ఆరా తీశారు. బాణసంచా తయారీకి సల్ఫర్, పొటాష్, గంధకం, బొగ్గు వినియోగించినట్టు గుర్తించారు. పేలుడు తీవ్రత ఎంత మేర జరిగింది, భవనం కూలేంతగా మందుగుండు ఏ మేరకు వాడారో క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటిలో ఇన్వర్టర్ బ్యాటరీ లీకవ్వడం, అందులోని రసాయన పదార్థాలు పేలడం కూడా ప్రమాదానికి కారణంగా గుర్తించారు. ప్రమాదం జరిగినప్పటి నుంచీ రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు, మండపేట రూరల్ ఎస్ఐ సురేష్, మండపేట అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

విపత్తుల నిర్వహణ మేనేజర్ బదిలీ

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.లావణ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను శ్రీకాకుళం జిల్లా వంశధార ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు.

కాంట్రాక్ట్ ఏఈ విధుల నుంచి తాత్కాలికంగా తొలగింపు

అన్నవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో వాటర్ వర్క్స్ విభాగం కాంట్రాక్ట్ ఏఈగా పని చేస్తున్న ఎం.గురవయ్యను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) వి.రామకృష్ణపై గురవయ్య అనుచితంగా ప్రవర్తించి, దుర్భాషలాడి కొట్టడానికి ప్లాస్టిక్ కుర్చీ ఎత్తాడు. అక్కడున్న డీఈ (ఎలక్ట్రికల్) వి.సత్యనారాయణ కలుగజేసుకుని అడ్డుకుని గురవయ్యను బయటకు పంపాడు. సహాయ కమిషనర్ కార్యాలయ అటెండరు, ఇతర సిబ్బంది సమక్షంలో ఈ ఘటన జరిగిందంటూ ఈఈ రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. జరిగిన ఘటనపై విచారణకు ఆదేశిస్తూ ఏఈ గురవయ్య స్థానంలో తాత్కాలికంగా పి.విజయప్రసాద్‌బాబు (కాంట్రాక్ట్ ఏఈ)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్తిపాడులో 4న లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చన





కోటి బిల్వార్చన జరగనున్న మైదానం (పైన) అయ్యప్ప పడి పూజకు వేదిక (కుడి)



వివరాలు వెల్లడిస్తున్న చంటి స్వామి

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో నవంబరు 4న లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చనను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. 25వేల మంది అయ్యప్ప భక్తులతో జరిపేందుకు మినర్వా కళాశాల ఎదుట ఎనిమిది ఎకరాల సువిశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు. రూ.80లక్షల నుంచి కోటి రూపాయల వరకు వ్యయం అయ్యే కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవంలను తిలకించడానికి రావాల్సిందిగా అయ్యప్ప స్వాములు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నారు. శబరిమల ఆలయ అర్చకుడు మేల్‌శాంతి, పందళ రాజవంశీయుడు నారాయణ వర్మ రానున్నట్టు అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ సభ్యుడు, గురుస్వామి చంటిస్వామి మంగళవారం విలేకరులకు తెలిపారు. లక్ష్మీగణపతి హోమం, చండీ హోమం,పూర్ణాహుతి, దండపాణి గురువర్యుల గురుపూజోత్సవం జరుపుతామని చంటిస్వామి చెప్పారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో సత్తా

కాకినాడ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అండర్-17 విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు క్రీడాకారులు ప్రతిభ చాటారు. అన్ని విభాగాల్లోనూ సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. విజేతలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి, డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాస కుమార్, డీఈవో పి.రమేష్ అభినందించారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్


ఆయుధాలను పరీక్షిస్తున్న విద్యార్థులు

కాకినాడ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఓపెన్ హౌస్‌లో భాగం గా పోలీసులు వినియోగించే తుపాకీలు, బ్యారెల్ గన్స్, ఆయుధాల వినియోగం, నేరాల నియంత్రణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఆయుధాలు పరీక్షించిన విద్యార్థులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

వేట్లపాలెంలో లోకాయుక్త విచారణ

సామర్లకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేట్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం లోకాయుక్త విచారణ నిర్వహించారు. వేట్లపాలెం గ్రామ పంచాయతీలో గత పాలకవర్గంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై విచారణ నిర్వహించారు. జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఎల్పీవో అన్నామణి, ఈవోపీఆర్డీ భైరవమూర్తి, ఆడిటర్ సురేష్‌బాబు, లోకాయుక్త ప్రతినిధులు హాజరయ్యారు. గతంలో వేట్ల పాలెం పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన ముగ్గురు కార్యదర్శులకు ఇద్దరు పదవీవిరమణ చెందగా వారిలో ఇద్దరు కార్యదర్శులు హాజరయ్యారు. మంగళవారం విచారణ అసంపూర్తిగా నిర్వహించినట్టు అధికారుల ద్వారా తెలిసింది.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

తాళ్లరేవు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి ఓఎన్‌జీసీ సంస్థ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాళ్లరేవు, పి.మల్లవరం హైస్కూల్స్ విద్యార్థులకు ఓఎన్‌జీసీ సీఎస్‌ఆర్ నిధులతో కొనుగోలుచేసి సైకిళ్లను ఆ సంస్థ ప్రతినిధులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత, ఉపాధ్యాయులు కిషోర్, అప్పారావు పాల్గొన్నారు.

చెందుర్తిలో గ్రామ సభ

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో ప్రజలు నుంచి వచ్చే అభ్యంతరాలకు పరిష్కారం చూపిస్తామని గొల్లప్రోలు తహశీల్దారు సత్యనారాయణ తెలిపారు. చెందుర్తి గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ప్రజలు నుంచి భూమి రీసర్వేలో వచ్చిన తప్పులు, విస్తీర్ణాల్లో తేడాలు, ఒకే ఎల్‌పీఎం రావడం తదితర అంశాలపై రైతులు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహశీల్దారు మస్తానీ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌కు సత్కారం

కాకినాడ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సేవల్లో సూపర్ బజార్‌కు ప్రత్యేక స్థానం ఉందని పుదుచ్చేరి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ వచ్చిన మల్లాడి కృష్ణారావు సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుతో కలిసి వెళ్లి సూపర్ బజార్ చైర్మన్ గ్రెసింగి ఆదినారాయణను శాలుశాతో సత్కరించారు. బజార్ సిబ్బందిని కృష్ణారావు, వనమాడికి ఆదినారాయణ పరిచయం చేశారు.

మెగా వైద్య శిబిరం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ యూనిట్ ఆసుపత్రిలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని అసిస్టెంట్ కమాండెంట్ డి.మురళికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ భీమశంకర్, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ లక్ష్మీ ఉన్నారు.

దర్గా సందర్శనకు పయనం

కాకినాడ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇరాక్ దేశంలోని బాగ్దాద్‌లో హజరత్ మహబూబ్ సుభాని దర్గా సందర్శనకు కాకినాడకు చెందిన ఆర్‌అండ్‌బీ రిటైర్డ్ ఉద్యోగి అహ్మదుల్లాఖాన్ దురాని బయలుదేరివెళ్లారు. మంగళవారం రాత్రి ఆయనకు టౌన్ రైల్వే స్టేషన్‌లో ముస్లింలు వీడ్కోలు పలికారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ బషీరు ద్దీన్, ముస్లిం ప్రతినిధులు మున్నా, సలీం, ఆలీఖాన్ ఉన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

అధికారులపై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

పెద్దాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం వాడీవేడిగా సాగింది. చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులపై ధ్వజమెత్తారు. కౌన్సిలర్ పప్పల దుర్గారావు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెల విషయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ శతాబ్ది పార్కులో సౌకర్యాలు మెరుగుపరచాలని, పాండవుల మెట్ట వద్ద ఉన్న జర్నలిస్టు కాలనీకి తాగునీటి వసతికోసం పైప్‌లైన్ నిర్మాణం చేయకపోవడానికి గల కారణమేంటని ప్రశ్నించారు. పట్టణంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, సచివాయల సిబ్బందిని వినియోగించుకోలేకపోవడం ఏంటని నిలదీశారు. కౌన్సిలర్ విడదాసరి రాజా మాట్లాడుతూ స్థానిక మెయిన్ రోడ్డు వేములవారి జంక్షన్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల అన్యాంక్రాంతాన్ని అడ్డుకోవాలన్నారు. అరెళ్ల వీరరాఘవరావు మాట్లాడుతూ పాత పెద్దాపురంలో ఒకటవ వార్డులో జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ప్రకాశరావు, ఏఈ జీవప్రసాద్, ఆర్వో వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు పిఠాపురం కౌన్సిల్ అత్యవసర సమావేశం

పిఠాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు జరుగుతుందని కమిషనరు కనకారావు తెలిపారు. చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని అంశాలతో పాటు సభ్యులు ప్రస్తావించే విషయాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల పదోన్నతి సీనియారిటీ లిస్టు

కాకినాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్, కార్పొరేషన్ నందు పనిచేస్తున్న ఉపాధ్యాయులకు (ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్) పదోన్నతి ఇవ్వడానికి పాఠశాల విద్యాశాఖ ఈనెల 26న ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ లిస్టును deoeg.org వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే నవంబరు 1లోపు కాకినాడ విద్యా శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.


టీడీపీ సభ్యత్వ నమోదును బాధ్యతగా తీసుకోవాలి

పిఠాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని ఎక్కువ సభ్యత్వాలు జరిగేలా చూడాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, పట్టణ, మండలాధ్యక్షులు సకుమళ్ల గంగాధర్, గుండ్ర సుబ్బారావు, ఉలవకాయల దేవేంద్రుడు, అనిశెట్టి సత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ అధికారులకు ముగిసిన శిక్షణ

సామర్లకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో 8 జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్ అధికారులకు 2రోజుల శిక్షణా తరగతుల ముగింపు సభ మంగళవారం వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణా తరగతులు పూర్తిచేసుకున్న 100 మంది అధికారులకు కేంద్ర ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఫ్యాకల్టీలు తదితరులున్నారు.





బాణసంచా క్షతగాత్రులకు మంత్రి పరామర్శ

జీజీహెచ్ (కాకినాడ) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామంలో సోమవారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో తీవ్ర గాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం పరామర్శించారు. సంఘటనలో ఒకరు మృత్యువాత పడడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జీజీహెచ్, బర్న్స్ వార్డులో చికిత్స పొందుతున్న కల్లు జయశ్రీని పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని డా.శివకుమార్ బృందాన్ని కోరారు. ప్రజలు మందుగుండు సామాగ్రితో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, సీఎస్ ఆర్ఎంవో డా.కోనాల అనిత, సర్జరీ హెచ్‌వోడి డా.శ్రీనివాసరావు, డా.శివకుమార్, సీఎంవో డా.లావణ్య ఉన్నారు.


సర్జరీ వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ సభ్యులకు మంచి రోజులు : ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ సభ్యులకు మంచి రోజులు రాబోతున్నాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఈ సొసైటీ సభ్యులతో మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసిన అనంతరం కొండబాబు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అనుచరులు సొసైటీ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. అనేక అక్రమాలకు పాల్పడి సొసైటీ సభ్యులను అనేక విధాలుగా బాధపెట్టారన్నారు. జయలక్ష్మి సొసైటీ బ్యాంకు సంబంధించిన ఆస్తులన్నీ జప్తు చేసి సభ్యులకు రావాల్సిన సొమ్ము చెల్లించి న్యాయం చేస్తామన్నారు. కేఎస్ ఈజడ్‌లో భూములు, హైదారబాద్‌లో ఆస్తులు ఉన్నాయన్నారు. సభ్యులకు రూ 380 కోట్లు చెల్లించాలని, సొసైటీకి రూ.700 కోట్లు ఆస్తులున్నాయని తెలిపారు. సభ్యులందరూ సంతోషంగా ఉండాలని, కూటమి ప్రభుత్వంలో న్యాయంచేస్తామని తెలిపారు.

'పాఠశాలల పరిరక్షణకు సహకరించాలి'

కరప, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా వాటి పరిరక్షణకు సహకరించాలని పీఆర్‌టీయూ నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సంఘ మండలాధ్యక్షుడు బొజ్జ మంగారావు, కార్యదర్శి పాట్నీడి నాగేశ్వరరావు, సీపీఎస్ జిల్లా కన్వీనర్ వాకాడ వెంకటరమణ, కామేశ్వరరావు మంగళవారం తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, కరప పోలీసులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలందజేశారు. రాత్రి సమయాల్లో ఆకతాయిలు ప్రభుత్వ పాఠశాలల్లో మద్యం తాగుతున్నారని, టీవీలు, విలువైన ఫర్నీచర్‌లు ఉన్నందున తగిన రక్షణ కల్పించాలని కోరారు.

పట్టపగలే చోరీ

కాకినాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం తూరంగిలో పట్టపగలే చోరీ జరిగింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన డి.వరదరాజు భార్య తన ఇంటికి ఉదయం తాళం వేసుకుని బయటకు వెళ్లిందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువాలో గల సుమారు రూ.1లక్ష విలువ చేసే బంగారం, వెండి వస్తువులు చోరీ చేసినట్టు ఎస్‌ఐ ఎం.వీరబాబు తెలిపారు. వరదరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాక్సింగ్‌లో కాంస్యం



పిఠాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పిఠాపురం బాక్సర్ కాంస్య పతకం సాధించింది. విజయవాడలో ఈ నెల 27 నుంచి 29 వరకూ నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్‌లో బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారిణి జె.ఐశ్వర్య ప్రతిభ కనబరిచి 81కిలోల ఓపెన్ వెయిట్ విభాగంలో కాంస్య పతకాన్ని గెలుపొందింది. ఐశ్వర్య, కోచ్ పి.లక్ష్మణరావును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ శివరామకృష్ణ అభినందించారు.





'బడుగు, బలహీనవర్గాలకు అండగా బీజేపీ'

ఏలేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. మంగళవారం మండలంలోని యర్రవరంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, తూర్పు లక్ష్మీపురంలో కూరాకుల రాజా ఆధ్వర్యంలో విశ్వకర్మయోజన పథకంపై అవగాహన కల్పించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'కూటమి' అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

రంపచోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌పీ ఫంక్షన్ హాలులో ఆమె అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, విశాఖపట్నం ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాని సూచించారు. మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్‌రావు, బీజేపీ నాయకుడు భారతి, జనసేన కన్వీనర్ కుర్ల రాజశేఖర్, 11 మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

వై.రామవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూముల రీసర్వే పనులు, మ్యుటేషన్ మార్పులను త్వరితగతిన పూర్తి చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె వై.రామవరం తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించి బీఎల్వోలు, వీఆర్‌ఏ, వీఆర్వోలకు తగు సూచనలు ఇచ్చారు. మ్యుటేషన్ల మార్పుల్లో వై.రామవరం మండలం వెనుకబడి ఉందని, అధిక సంఖ్యలో లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారన్నారు. ఎవరైనా విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లో గ్రామసభల ద్వారా భూమి యజమానులకు అవగాహన కల్పించాలని వారి ఇష్టపూర్వకంగా భూములను పంపిణీ చేయాలన్నారు. గ్రామంలో ఇంకా ప్రారంభం కాని ఇండేన్ గ్యాస్ గొడౌన్‌ను తనిఖీ చేసి వాటి పత్రాలను పరిశీలించారు. అనంతరం సామాజిక ఆసుపత్రికి వెళ్లి రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దారు వేణుగోపాల్, డీటీ సుధాకరరావు, ఆర్‌ఐ శాంత కుమారి, సీనియర్ అసిస్టెంట్ వెంకటశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాల నివారణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వైద్యాధికారులు, ఆర్‌ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై ప్రతి మంగళవారం వైద్యాధికారులు, సీడీపీవోలతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహిస్తామన్నారు. మాతృ, శిశు మరణాలు సంభవిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సెలవు దినాల్లో వైద్యాధికారులు, సిబ్బంది వైద్య సేవల కోసం అందుబాటులో ఉండాలని సూచించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, వైద్యాధికారులు రాధిక, భావన, హరికృష్ణ, సాయిరతన్, వినోద్, సుజాత, షామిన్, నాయక్, నాగార్జున, జ్యోతిర్మయి, ఎంపీహెచ్‌వో పీటర్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

ఏజెన్సీలోని గిరిజన యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే చేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో సచివాలయ సిబ్బంది 59ఏళ్లలోపు వారి అర్హతలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలను కో-ఆర్డినేటర్లుగా నియమించారు. శిక్షణ కో-ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధి కల్పన అధికారి సతీష్, యూత్ ట్రైనింగ్ మేనేజరు సుదీష్, కో-ఆర్డినేటర్లు కళ్యాణి, ఆనంద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

దేవీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన దేవీపట్నం, పూడిపల్లి గ్రామాల ప్రజలకు గోకవరం మండలం గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో పునరావాస కాలనీ కల్పించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మొదలెట్టిన ఈ కాలనీ నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు మూడు సంవత్సరాలుగా బయట గ్రామాల్లో అద్దెకు ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం గోకవరం మండల పర్యటనకు విచ్చేసిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను దేవీపట్నం నిర్వాసితులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మరో రెండు రోజుల్లో కాలనీని సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

బాణసంచా విక్రేతలకు నిబంధనలు తప్పనిసరి

చింతూరు సీఐ దుర్గాప్రసాద్

మోతుగూడెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం, చింతూరు మండల పరిధిలో దీపావళి సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ కోరారు. పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు దగ్గరుండి వారు ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలుష్యరహిత టపాసులను పేల్చాలన్నారు. లైసెన్స్ లేకుండా ఎవరైనా మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ ఉంచినా, అమ్మినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. సహాయం అవసరమైనప్పుడు, అత్యవసర సమయంలో ఫైర్‌స్టేషన్‌కు 101 డయల్ చేయాలన్నారు. ఎక్కడైనా మందు గుండు సామగ్రి అక్రమ, విక్రయాలకు నిల్వలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. తెలిపిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కూనవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టపాసుల అమ్మకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కూనవరం తహసీల్దారు శ్రీనివాస్ పేర్కొన్నారు. షాపుల యజమానులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. కూనవరం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో బాణసంచా విక్రయించే స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఎస్‌ఐ లతాశ్రీ, కూనవరం మేజర్ పంచాయతీ ఈవో సురేష్‌కుమార్, వీఆర్వో వెంకన్న, సర్పంచ్ హేమంత్ పాల్గొన్నారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తం'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం, స్పార్క్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా నవంబరు1న ఏలేశ్వరం వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో నిర్వహించే సైబర్ క్రైం కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సైబర్ నేరాలతో ప్రజలు తీవ్రంగా నష్ట పోతున్నారని, సోషల్ మీడియా, సెల్‌ఫోన్ మెసేజ్‌లకు స్పందించి అనేక మంది నగదు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ సాయి సందీప్, ప్రకృతి పరిరక్షణ సమితి ఫౌండర్ డాక్టర్ విజయ్‌బాబు, స్పార్క్ కో ఆర్డినేటర్ రవికుమార్, సంఘం ప్రతినిధులు అనుసూరి నాగేశ్వరరావు, పర్వత సత్యనారాయణ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కిర్లంపూడి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. మంగళవారం మండలంలోని శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం గ్రామాల్లో ఆయన పర్యటించి టీడీపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తోట రవి, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, సర్పంచ్ పట్టు చంటిబాబు, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివసూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

కిర్లంపూడి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈనెల 8 నుంచి 28 వరకు సామాజిక తనిఖీ బృందం మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. ఈ సామాజిక తనిఖీల్లో పలు అంశాలను గుర్తించారు. పనులపై ఖర్చుల వివరాలు, రికవరీలు వంటి వాటిని తెలిపారు. రూ.7,68,207పై ప్రత్తిపాడు విభాగం డ్వామా సహాయ పథక సంచాలకులు విచారణ నిర్వహించాలని ప్రిసెండింగ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటలక్ష్మి, డ్వామా పీడీ భాను ప్రకాష్, ఎంపీడీవో బి.హరికృష్ణ, ఎస్‌ఆర్పీ పి.సింహాద్రి, ఏపీవో నాయుడు ఉన్నారు.

విజిలెన్స్ వాక్‌థాన్

గండేపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2024 సందర్భంగా ఈ సంస్థ ఉద్యోగులు రామేశ్వరంపేట కూడలి వరకు వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. డీజీఎం పవన్‌కుమార్ మాట్లాడుతూ అవినీతి నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని, ఎవరైనా కేంద్రప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడితే పీడీపీ చట్టం ద్వారా సంబంధిత అధికారులకు విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. నాయకంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో మేనేజర్లు వీరేంద్ర, కోటేశ్వరరావు, మహేష్, మూర్తి పాల్గొన్నారు.

'బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు'

ప్రత్తిపాడు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసినా, నిషేధిత రసాయనాలతో టపాసులు తయారు చేసి విక్రయించినా చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని ప్రత్తిపాడు సీఐ వి.సూర్య అప్పారావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ టపాసులు తయారీ, సరఫరా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇళ్లలో బాణసంచా ఎట్టి పరిస్థితుల్లో నిల్వఉంచరాదన్నారు. దీపావళి పండుగను ప్రజలు ఆనందంగా నిర్వహించుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

దేవీపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దారు సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన గ్రాడ్యుయేట్ లేదా తత్సమాన డిగ్రీ ధ్రువపత్రం, గుర్తింపు కార్డు నకలు, ఏదైనా నివాస ధ్రువపత్రం సమర్పించాలన్నారు. నవంబరు 6 చివరి రోజు అని, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

నలుగురు పందెంరాయుళ్ల అరెస్టు

ఎటపాక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులోని తునికిచెరువు గ్రామ సమీపంలో మంగళవారం తెలంగాణకు చెందిన జూదగాళ్లు కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. సీఐ కన్నపరాజు తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. నలుగురు పందెంరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.2,200 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. పందెంరాయుళ్లపై కేసు నమోదు చేశారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రంపచోడవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరును మంగళవారం అమరావతిలో కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న నాల్గవ తరగతి సిబ్బంది కుక్, కమాటీ, వాచ్‌మెన్, అటెండర్లకు యూనిఫామ్స్ పంపిణీ, వసతి గృహాలకు గ్యాస్ సరఫరా, ఏటీడబ్ల్యువో కార్యాలయాల్లో ఉన్న వాచ్‌మెన్ కమ్ హెల్పర్లను అటెండర్‌గా మార్పు చేయాలని కోరారు. అందజేశారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్.రామన్నదొర, డి.తాతాజీ, పి.చిన్నారెడ్డి, పి.నాగేశ్వరరావు తదితరులు డైరెక్టరును కలిసిన వారిలో ఉన్నారు.

కరెంటు ఉచ్చులు వేయడం చట్టరీత్యా నేరం

డొంకరాయి ఎస్ఐ శివకుమార్

మోతుగూడెం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పరిధిలో హంపదురు గ్రామంలో ఎస్ఐ శివకుమార్ కరెంటు ఉచ్చులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కరెంటు ఉచ్చులు వేసి అడవి జంతువులను వేటాడడం చట్టరీత్యానేరమన్నారు. ఇలాంటి కరెంటు ఉచ్చుల వల్ల మనిషిప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. కరెంటు ఉచ్చులు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి రవాణా చేయడం, అమ్మడం, కలిగి ఉండడం, తాగడం నేరమన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

శెట్టిబలిజల కోసం పోరాడిన వెంకటరెడ్డి

మంత్రి వాసంశెట్టి సుభాష్


ఎస్ఎస్‌పట్నంలో మంత్రిని సత్కరిస్తున్న దృశ్యం

రౌతులపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కులస్తులు ఆరాధ్య దైవం, శెట్టిబలిజ జాతిపిత, దొమ్మేటి వెంకటరెడ్డి అని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రౌతులపూడి మండలం ఎస్ఎస్‌పట్నం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకటరెడ్డి విగ్రహాన్ని మంగళవారం రాత్రి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వందేళ్ల క్రితమే శెట్టిబలిజల కోసం పోరాడిన వ్యక్తి వెంకటరెడ్డి అన్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, మీ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సత్యప్రభ మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరైనట్టు చెప్పారు.

ఒరిగిన వేదిక...తప్పిన ప్రమాదం

మంత్రి నిలుచున్న వేదిక ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో ఒరగడంతో మంత్రిని సహచరులు పట్టుకోవడంతో, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తతో ప్రమాదం తప్పింది. కార్యక్రమంలో ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, రాష్ట్ర జనసేన సంయుక్తకార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, చిన్ని సూరిబాబు, చిన్ని అప్పలనాయుడు, లాలం అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం'

జగ్గంపేట, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గుమ్మళ్ళ దొడ్డి అస్సాగో ఫ్యాక్టరీని రాజకీయం చేయద్దని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల ఆవేదన మేరకు ఎమ్మెల్యే హోదాలో కూటమి నాయకులను ఫ్యాక్టరీలోకి తీసుకెళ్లామని, ప్రజల ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి షరతులు విధించడం జరిగిందని తెలిపారు. ఆ తర్వాత మాజీ జడ్పీ చైర్మన్ నవీన్‌కుమార్ ఫ్యాక్టరీ సందర్శించి అన్ని రాజకీయ పార్టీలతో కమిటీగా ఏర్పాటుచేయబోయే తరుణంలో కొంతమంది సొంత ఎజెండా కోసం నిరాహార దీక్షలకు దిగడం సమస్యను పక్కదారి పట్టించడమేనని పేర్కొన్నారు. స్థానిక ప్రజల ఆందోళన ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో అధికంగా కూటమి నాయకులు పాల్గొన్నారు.

'శ్రీ ప్రకాష్'లో ధన్వంతరి జయంతి


ఆయుర్వేద వైద్యులను సన్మానిస్తున్న నరసింహారావు

తుని రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలోని శ్రీ ప్రకాష్ ఆయుర్వేద హాస్పటల్ నందు మంగళవారం ధన్వంతరి జయంతి వేడుకలను శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రీసెర్చ్ ఫౌండర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వజనుల ఆరోగ్యం సుభిక్షంగా ఉండలని ట్రస్టీ సీహెచ్‌వీకే నరసింహారావు, రామతులసి దంపతులు చేతులమీదుగా ధన్వంతరి హోమం నిర్వహించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, కేరళ రాష్ట్రానికి చెందిన సునేత్రి ఆయుర్వేదాశ్రమం, పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రసాద్, జటాస్ ఆయుర్వేదిక్ హెల్త్‌కేర్ సిస్టమ్స్ మేనేజింగ్‌పార్టనర్ డాక్టర్ జలావల్లభుల ఎల్ఎన్‌శాస్త్రిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రసాద్, సమీరా దంపతులు, శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ రీసెర్చ్ ట్రస్ట్ అడ్వైజర్ డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆయుర్వేద చికిత్సాలయం ప్రధాన వైద్యులు డాక్టర్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు బృందం, ప్రముఖులు హాజరయ్యారు.

నాగబాబు జన్మదిన వేడుకలు


జగ్గంపేటలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

జగ్గంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, మెగా బ్రదర్ నాగబాబు జన్మదినం సందర్భంగా జగ్గంపేటలో జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ 600 మందికి అన్నదానం చేశారు. అభిమానుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. మండలాల్లోని గ్రామాల్లో మొక్కలు నాటారు. రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, మరిసే రామకృష్ణ, రాజనాలశ్రీను, సురపరెడ్డి నరేష్, రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను,మొగిలి గంగాధర్, మాదారపు వీరబాబు, రామకుర్తి నరసింహం, గంధం శ్రీనివాస్ ఉన్నారు.

కిర్లంపూడి: జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు జన్మదినం సందర్భంగా మండలంలోని రామచంద్రపురంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. కాయల మణికంఠ, సుంకర రాజు, కాయల శ్రీను, రేపూరి శ్రీను, దత్తయ్య, సత్యంశెట్టి ప్రసాద్, కాయల సురేష్‌,కోలుమల్ల ఆదియ్య ఉన్నారు.

ఏలేశ్వరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఏలేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం నగర పంచాయితీ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ శేషరాజు అజెండాలోని అంశాలను చదివి వినిపించగా అప్పనపాలెం తాగునీరు అంశం తప్ప మిగిలిన అంశాలను 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ తిరస్కరించారు. అంశాలను సమావేశానికి ముందు కౌన్సిలర్లకు తెలియజేసి అజెండా ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. కమిషనర్ సత్యనారాయణ పెట్టిన శుభోదయం కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్లకు సమాచారమివ్వకుండా వార్డుల్లో పనులు చేపట్టడం తగదన్నారు. 12 వార్డు కౌన్సిలర్ సామంతు హైమావతి మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం పెట్టడం సరికాదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, కోరాడ రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన కీలకం : జేడీ


ఎస్ఆర్‌పేటలో వివరాలు పరిశీలిస్తున్న జేడీ

కోటనందూరు, అక్టోబరు 29: (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక రంగంలో అభివృద్ధి సాధించడానికి, సరైన ప్రణాళికలు రూపొందించడానికి పశుగణన కార్యక్రమం కీలకమైందని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ సూర్యప్రకాశ్ తెలిపారు. కోటనందూరు పశువుల ఆసుపత్రి, జగన్నాధపురం, ఎస్ఆర్‌పేటలో పశుగణన వివరాలను మంగళవారం ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 246 మంది విషయసేకరణదారులు, 54మంది పర్యవేక్షకులు, 10మంది సహాయసంచాలకులు, 1ఉపసంచాలకులతో పశుగణన చేస్తున్నామని తెలిపారు. పశుగణనలో ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల కుక్కలు, కుందేళ్ల వంటి సమస్త జంతుజాతి సమాచారాన్ని సేకరిస్తామన్నారు. ఆయన వెంట ఏడీ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రత్న తేజ, మాజీ సర్పంచ్ యర్ర చినసత్యనారాయన ఉన్నారు.

రామ మందిరానికి నిధులు

తుని రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య చొరవతో ఏ అగ్రహారంలో రామ మందిరానికి నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే దివ్య సిఫార్సులతో తిరుమల తిరుపతి దేవస్థానం రూ.2.95లక్షలు సమకూర్చింది. ఈ చెక్కును తేటగుంట టీడీపీ కార్యాలయంలో యనమల ఆలయకమిటీకి ఇచ్చారు.